# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

# ANDHRA PRADESH COMMITTEE

M.B.BHAVAN, 1-1-60/2,RTC X ROADS, HYDERABAD -20,
☎ 040-27665011, 27665012, Fax: 040- 27601001
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్థం:** తేది: 17. 02. 2012

మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం డవలప్‌మెంట్ బడ్జెట్ పేరుతో ఒక డిసెప్షన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అంకెల గారడీలు తప్ప ఈ బడ్జెట్ నుండి ప్రజలకు ఒరిగేది ఏమీ కనపడలేదు. పాత అంకెల్ని చిన్న చిన్న మార్పులతో 20 శాతం హెచ్చించి లెక్కలు తయారుచేసినట్లు కనపడుతున్నది. ఈ పెరుగుదలలన్నీ కోతకు గురౌతాయని గత బడ్జెట్లు అమలయిన అనుభవాన్ని చూస్తే అనుకోక తప్పదు.

కాంగ్రెస్ అదిష్టానం రాష్ట్ర కాంగ్రెస్‌లు గత రెండు సంవత్సరాల నుండి సృష్టించిన అస్తవ్యస్త పరిస్థితులు రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దిగజార్చాయి. 2010-11 సంవత్సరంలో, 2011-12 సంవత్సరంలో కూడా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కుంటుపడింది. 2011-12 సంవత్సరంలో 6.81 శాతం మాత్రమే ఉన్నది. ఈ సంవత్సరం పరిస్థితి మెరుగవుతుందని అనుకోలేము. అయినా వచ్చే సంవత్సరానికి 20 శాతం ఆదాయం పెరగనున్నట్లు బడ్జెట్టు లెక్కలు చూపిస్తున్నాయి. అంటే ఈ ఆదాయాన్ని రాబట్టుకోవడానికి పరోక్ష పన్నులను ప్రభుత్వం భారీగా ప్రజలపై వడ్డించడానికి సిద్ధమవుతున్నదన్నమాట! రాష్ట్రమంతా మద్యం వినియోగం ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతున్నా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కూడా మద్యమే ప్రధాన ఆదాయ వనరుగా చూపించడం సిగ్గుచేటు. సరకుల మీద పన్నుల ద్వారా 25శాతం ఆదాయం సంపాదించడమంటే సుమారుగా 9000 కోట్ల భారం ప్రజల మీద పడబోతున్నది. వాహనాలపై పన్నుల ద్వారా మరో 800 కోట్లు అంటే 28 శాతం భారం పడనున్నది. ఇప్పటికే దఫదఫాలు పెంచిన భారాలతో పాటు (విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసి ఛార్జీలు, భూమి రిజిస్ట్రేషన్ ఛార్జీలు, ఆస్థిపన్ను, నీటి పన్ను, చెత్తపన్ను, వగైరా..) రాబోయే కాలంలో మరిన్ని భారాలు పడబోతున్నాయనేది బడ్జెట్ ద్వారా విదితమవుతోంది.

విద్యుత్‌రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నా దాని గురించి ప్రభుత్వం ప్రస్తావించలేదు. ఇంధన రంగానికి 5937 కోట్లు కేటాయిస్తే, విద్యుత్‌రంగం ఏరకంగా బయటపడుతుందో అర్థం కాదు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలు 4950 కోట్లు, ఇంధన సర్ ఛార్జీ అడ్జస్ట్‌మెంట్ పేరుతో 3024 కోట్లు, మొత్తం 8961 కోట్ల భారాన్ని ప్రజలకు వడ్డించడానికి విద్యుత్ సంస్థలు సిద్ధమవుతుంటే ఆ భారాన్ని నిరోధించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం శోచనీయం. పేదలకు ఉపయోగపడే గృహనిర్మాణం, మంచినీటి సరఫరా వంటి రంగాలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించారు. వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉంటే ధరలను స్థిరీకరించేందుకు గానీ, పంటలకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు గాని అవసరమైన ప్రస్తావనలు లేవు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ప్రక్కదాని పడుతున్నాయని వస్తున్న విమర్శలకు సమాధానం లేదు. ఇప్పటి వరకు ప్రక్కదారిన పట్టిన నిధుల మేరకైనా దళిత, గిరిజన సంక్షేమానికి అదనంగా భారీ కేటాయింపులు లేవు. ఆరోగ్య రంగానికి అఖిల భారత స్థాయిలో ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. పూర్తిగా సంక్షోభంలో పడిపోయిన ఆరోగ్య రంగాన్ని బయటవేయడానికి ఈ బడ్జెట్ ఏ మాత్రం ప్రయత్నం చేయలేదు. సంక్షేమం గురించి, బలహీనవర్గాల గురించి మాటల గుభాళింపే తప్ప కేటాయింపులు తగినట్లుగా లేవు.

గత బడ్జెట్ల లాగనే ఈ బడ్జెట్‌లో జలయజ్ఞానికి భారీగా కేటాయింపులు చూపించింది. ఇప్పటి వరకు ఖర్చుపెట్టిన 60వేల కోట్ల రూపాయలు మురికి కాలువలో పోసిన మంచినీళ్లలాగా వృధా అయిపోయాయని సర్వత్రా వినిపిస్తున్న తరుణంలో ఈ కేటాయింపులకు ఆ గతి పట్టదని చెప్పలేము. ఇప్పటి వరకు 17 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి తెచ్చిందని ప్రభుత్వం చెప్పింది. ఏ ప్రాజెక్టు క్రింద, ఏ జిల్లాలో, ఏ సంవత్సరం సాగు చేసారో వివరాలు చెప్తే ప్రభుత్వ మాటలు ఎంత బూటకాలో ప్రజలు అర్థం చేసుకుంటారు. రాష్ట్ర వాటా చెల్లించకపోవడం మూలంగా రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు వినియోగించుకోలేక వృధా అయ్యాయి. ఈ బడ్జెట్‌లో నామమాత్రపు ప్రస్తావన తప్ప తగినంత మోతాదులో కేటాయింపులు ప్రకటించలేదు. ఇటువంటి అవాస్తవాలతో అమలుకు నోచుకోని పథకాలతో రూపొందిన మాయల బడ్జెట్ వలన రాష్ట్ర ప్రజలకు ఏమీ ఒరగదు.

**(బి.వి.రాఘవులు)**
రాష్ట్రకార్యదర్శి